క్లుప్తంగా

602 మొబైల్ ఫోన్ల రికవరీ

రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను పరిశీలిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం: ప్రజలు వివిధ కారణాలతో పోగొట్టుకున్న 602 సెల్ ఫోన్లను జిల్లా పోలీసులు రికవరీ చేశారు. శనివారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ బిందుమాధవ్ చేతులమీదుగా బాధితులకు అందజేశారు. వీటి విలువ రూ.కోటి 20 లక్షల 40 వేలు ఉంటాయని ఎస్పీ తెలిపారు. ఇప్పటికి 12 విడతల్లో 4,603 మొబైల్ ఫోన్లను రికవరీ చేశామని, వాటి మొత్తం విలువ సుమారు 7.69 కోట్లు అని ఎస్పీ తెలిపారు. మొబైల్ పోగొట్టుకున్నా, చోరీకి గురైన సందర్భాల్లో బాధితులు తగిన వివరాలతో సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలో స్వచ్ఛత పక్వాడ

వాక్‌థాన్‌ను ప్రారంభిస్తున్న ఓఎన్‌జీసీ ఈడీ ప్రబల్ సేన్ గుప్తా

కాకినాడ రూరల్: ఓఎన్‌జీసీ ఈస్టర్న్ ఆఫ్ షోర్ అసెట్ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ వరకు స్వచ్ఛత పక్వాడ నిర్వహిస్తున్నట్టు సంస్థ ఈడీ ప్రబల్ సేన్ గుప్తా తెలియజేశారు. రమణయ్యపేటలోని ఓఎన్‌జీసీ హెచ్‌టీపీ కార్యాలయం వద్ద వాక్‌థాన్, వ్యాన్ జాతాలను శనివారం ఆయన ప్రారంభించారు. వాక్‌థాన్‌లో ఓఎన్‌జీసీ సిబ్బంది, జేఎన్‌టీయూకే పెట్రో కెమికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రమణయ్యపేట ఓఎన్‌జీసీ కార్యాలయం నుంచి సర్పవరం జంక్షన్, బోట్‌క్లబ్ మీదుగా తిరిగి ఓఎన్‌జీసీ కార్యాలయం వరకు నిర్వహించారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూకే ప్రిన్సిపాల్ పద్మరాజు పాల్గొన్నారు.

జిల్లా స్విమ్మింగ్ క్రీడాకారుల ఎంపిక

స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా స్విమ్మింగ్ సంఘం ఆధ్వర్యంలో జిల్లా క్రీడా మైదానంలోని స్విమ్మింగ్ పూల్‌లో శనివారం అంతర్ జిల్లాల స్విమ్మింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. డీఎస్‌డీఓ వి.సతీష్ కుమార్ పోటీలను ప్రారంభించారు. సబ్ జూనియర్స్, జూనియర్స్ విభాగంలో ఎంపికలు జరిగాయి. జిల్లా నలుమూల నుంచి 80 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. ఎంపికైనవారు ఈనెల 18, 19 తేదీలలో విశాఖలో జరిగే అంతర్ జిల్లాల స్విమ్మింగ్ పోటీలలో జిల్లా తరపున పాల్గొంటారు. కార్యక్రమంలో స్విమ్మింగ్ సంఘ కార్యదర్శి ఐ.రాజు, డీఎస్‌ఏ కోచ్ అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి బైండోవర్

కొత్తపల్లి: అనుమతులకు మించి అధిక లోతుగా మట్టిని తవ్వుతున్న వ్యక్తిని బైండోవర్ చేసినట్టు శనివారం పోలీసులు తెలిపారు. మండలంలోని పాత ఇసుకపల్లికి చెందిన నడింపల్లి నరసింహరాజు ఇంటి నిర్మాణం కోసం పంచాయతీ నుంచి అనుమతులు తీసుకున్నాడు. కానీ పరిమితికి మించి లోతుగా మట్టిని తవ్వించాడు. గుప్త నిధుల కోసం ఈ తవ్వకాలు చేసినట్టు ఆరోపణలు రావడంతో అతడిని బైండోవర్ చేశారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

పెద్దాపురం: రక్షణ చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని పెద్దాపురం డీఎస్పీ ఏబీజీ తిలక్ అన్నారు. పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో శనివారం విద్యార్థులకు నూతన పోలీసు చట్టాలు, పోక్స్ చట్టంపై అవగాహన కలిపించారు. ప్రతి విద్యార్థి నైతిక విలువలు కలిగి ఉండాలని సూచించారు. ఉజ్వల భవిష్యత్తుకు తరగతి గదులే స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. సమావేశంలో సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ ఎస్.శరత్చంద్ర కీర్తి, ఎస్సై యు.పాపారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ భద్రతపై అవగాహన

గొల్లప్రోలు (పిఠాపురం రూరల్): సైబర్ భద్రత, ట్రాఫిక్‌పై గొల్లప్రోలు శివాలయం వద్ద ఆటో డ్రైవర్లకు , ప్రజలకు సీఐ జి.శ్రీనివాస్ శనివారం అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లు విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆదేశించారు. అతి వేగం, సెల్ ఫోన్ డ్రైవింగ్ మంచిది కాదని, సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ మోసాలకు గురైతే 1930 హెల్ప్‌లైన్ కు ఫోన్ చేయాలని కోరారు. గంజాయి, మాదక ద్రవ్యాల రవాణా, విక్రయం, వినియోగం వంటి వాటిపై సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలన్నారు.

చిరునామాలే చిక్కుముళ్లు

- మందకొడిగా 'సర్' ప్రక్రియ
- జూలై 14 తుది గడువు
- 42 శాతం డిజిటలైజేషన్

రమణయ్యపేట సచివాలయం - 5లో ఎన్యూమరేషన్ ఫామ్‌లు డిజిటలైజ్ చేస్తున్న బీఎల్ఓలు

కాకినాడ రూరల్: ఓటర్ల జాబితా సమగ్ర సంక్షిప్త సవరణ (సర్) నియోజకవర్గంలో మందకొడిగా సాగుతోంది. జూన్ 15 నుంచి ప్రారంభమైన ఈ ప్రక్రియ ఈ నెల 14 వరకు సాగనుంది. మరో పది రోజులు మాత్రమే గడువు ఉండడంతో అధికారుల్లో ఆందోళన నెలకొంది. నియోజకవర్గంలో 264 పోలింగ్ కేంద్రాలు ఉండగా రూరల్ మండలంలో 152, కరప మండలంలో 66, కాకినాడ అర్బన్‌లో రూరల్ నియోజకవర్గ డివిజన్లలో 46 బూత్‌లో ఉన్నాయి. మొత్తం 2,71,318 మంది ఓటర్లకు గాను శనివారం నాటికి 1,20,086 మంది జాబితా మాత్రమే డిజిటలైజేషన్ చేశారు. అంటే సుమారు 44.26 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. మిగిలిన 1,56,076 మంది ఎన్యూమరేషన్ ఫామ్‌లు డిజిటలైజ్ చేయాల్సి ఉంది. ఈ నెల 21న ముసాయిదా రూపొందించి పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతారు. 21వ తేదీ నుంచి ఆగస్టు 21 వరకు అభ్యంతరాలు స్వీకరించి, ఆ రోజు నుంచి సెప్టెంబరు 18 వరకు అభ్యంతరాలు, చేర్పులు, మార్పులు తదితర అంశాలపై నిర్ణయం తీసుకుని సెప్టెంబరు 22న తుది జాబితాను ప్రచురిస్తారు.

పూర్తిస్థాయిలో అందని ఎన్యూమరేషన్ ఫామ్‌లు

సర్‌లో భాగంగా ఓటు హక్కు ఉన్న ప్రతి ఓటరు పేరును ముద్రించి ఉన్న ఎన్యుమరేషన్ ఫామ్‌లు ప్రతి ఒక్కరికి ఇవ్వాల్సి ఉంది. ఇవి నియోజకవర్గంలో చాలా మందికి ఇప్పటికీ అందలేదు. ముఖ్యంగా వలసదారులు, ఇళ్లు మారిన వారి చిరునామాలు తెలియక ఫారాలు అందజేయడంలో జాప్యం అవుతోంది. మృతులు, డబుల్ ఎంట్రీ ఓటర్ల వివరాలలో ఏ ఇబ్బందీ లేదు. ఇటువంటి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫామ్‌లు అందజేయడంలో బీఎల్ఓలు చేతులెత్తేస్తున్నారు. కాకినాడ రూరల్ రమణయ్యపేటలోని ఏపీఎస్పీ బెటాలియన్ క్వార్టర్ శిథిల స్థితికి చేరుకోవడంతో వాటిని చాలా వరకు తొలగించారు. సిబ్బంది ఉండడం లేదు. 60, 67 బూత్‌లు పరిధిలో సుమారు 1400 మంది ఏపీఎస్పీ బెటాలియన్ పోలీసులు ఓటు హక్కు కలిగి ఉండడంతో వారికి ఎన్యుమరేషన్ ఫామ్‌లు అందలేదు. వారిని ప్రస్తుతం ఎక్కడైతే నివాసం ఉంటున్నారో అక్కడ కొత్తగా నమోదు చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. కొత్తగా ఓటు నమోదు ప్రక్రియలో నిర్ధారణ పత్రాలు సక్రమంగా లేకపోతే వారి ఓట్లు నమోదులో ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుంది.

బీఎల్ఏలు చొరవ తీసుకోవాలి

ఎన్యూమరేషన్‌కు మరో పదిరోజులు గడువు ఉండడంతో తమ ఓటు హక్కును కాపాడుకునేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి. ఎన్యుమరేషన్ ఫారాలను బూత్ స్థాయి అధికారులకు అందజేసి డిజిటలైజ్ అయ్యేలా చొరవ తీసుకోవాలి. అలాగే వలసలు, చిరునామాలు మారిన ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాలు డిజిటలైజేషన్ కోసం రాజకీయ పార్టీలకు చెందిన బీఎల్ఏలు కృషి చేయాల్సి ఉంది.

అప్‌డేటెడ్ ఓటర్ల జాబితా అందివ్వాలి

చేర్పులు, మార్పులు తొలగించిన అప్‌డేటెడ్ ఓటర్ల జాబితాను బీఎల్ఏలకు అందజేయాలి. తమకు ఇచ్చిన జాబితాలో సుమారు 60 ఓట్లు లేవు. చిరునామాలు మారిన ఓటర్ల పట్ల బీఎల్ఓలు పదే పదే తిరిగి ఎన్యూమరేషన్ పూర్తి చేయాలి. చాలా మందికి ఫారాలు అందలేదు. బీఎల్ఏగా తాము సహకరిస్తున్నాం.

– బెజబాడ సత్యనారాయణ, బీఎల్ఏ, తిమ్మాపురం గ్రామ పంచాయతీ.

ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలి

సర్ ప్రక్రియ విజయవంతాని నియోజకవర్గ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలి. ఎన్యూమరేషన్ ఫారాలను సకాలంలో బీఎల్ఓలకు అందజేసి డిజిటలైజేషన్‌కు సహకరించాలి. ఈనెల 10వ తేదీలోపు బీఎల్ఓలకు ఫారాలు సమర్పించాలి.

– ఎస్.మల్లిబాబు, ఈఆర్వో, కాకినాడ రూరల్

'సర్'కు సహకరించాలి



తిమ్మాపురంలోని ఆయన నివాసంలో బీఎల్ఓకు ఎన్యూమరేషన్ పత్రాలు అందజేస్తున్న చాగంటి కోటేశ్వరరావు

కాకినాడ రూరల్: సర్‌కు పౌరులంతా సహకరించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు కోరారు. కుటుంబ సభ్యుల వివరాలు నింపిన ఎన్యూమరేషన్ ఫారాలను శనివారం తిమ్మాపురంలోని ఆయన నివాసంలో బీఎల్ఓకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హులైన ఓటర్లందరితో కూడిన సమగ్ర జాబితా రూపకల్పనకు స్వచ్ఛందంగా ప్రజలు సహకరించాలన్నారు. ఎన్యుమరేషన్ పత్రాలను బాధ్యతగా పూర్తి చేసి బూత్ స్థాయి అధికారులకు అందజేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సీసీ సుబ్బారావు పాల్గొన్నారు.

ఏడు శనివారాల వ్రత ప్రదక్షిణలు ప్రారంభం

బోట్‌క్లబ్: స్థానిక జగన్నాథపురంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏడు శనివారాల వ్రత ప్రదక్షిణలు శనివారం నుంచి ప్రారంభించినట్లు ఈవో ఎస్.సత్యవాణి తెలిపారు. ఏడు శనివారాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలమన్నారు. స్వామి వారి ఆలయంలో ఆరోగ్యం, ఆయుష్షు, విద్య, ఉద్యోగం, వివాహం, సంతానం తదితర కోర్కెలతో శనివారం 7 ప్రదక్షిణల చొప్పున ఏడు వారాలు చేస్తే స్వామి అనుగ్రహం లభిస్తుందన్నారు. 8వ శనివారం ఏడు ప్రదక్షిణలు చేసిన స్వామి వారి అష్టోత్తర అర్చన చేయించుకొని స్వామి వారి ఆశీస్సులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఆలయ కమిటీ చైర్మన్ మల్లాడి ఏడుకొండలు పాల్గొన్నారు.

పశువులను వదిలే యజమానులపై చర్యలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): రహదారులపై పశువులను వదిలే యజమానులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర హరేంధిరప్రసాద్ హెచ్చరించారు. జిల్లాలోని ప్రధాన రహదారులు, జాతీయ రహదారులపై పశువులను స్వేచ్ఛగా వదలడం వల్ల నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో కలెక్టర్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత హెచ్చరికలను బేఖాతరు చేస్తున్న యజమానులపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రధాన, జాతీయ రహదారులు, రద్దీ ప్రాంతాల్లో పశువులను మేత కోసం వదలడం, స్వేచ్ఛగా సంచరించనివ్వడం పూర్తి నిషేధమని, ఈ మేరకు చట్టాలు, సెక్షన్ల ప్రకారం చర్యలు తీసుకోవాలని సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల ప్రాణ రక్షణ అత్యంత ప్రాధాన్యమైనదని, రోడ్లపై తిరిగే పశువుల వల్ల వాహన చోదకులతో పాటు ఆ పశువులు కూడా ప్రాణాపాయానికి గురవుతున్నాయన్నారు. పశువుల యజమానులు తక్షణమే బాధ్యతాయుతంగా వ్యవహరించి, తమ పశువులను సొంత స్థలాల్లోను, అనుమతించిన ప్రాంతాల్లో మాత్రమే ఉంచుకోవాలని, ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే ఎటువంటి సానుభూతి లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఆకతాయిలపై కేసులు

పెద్దాపురం: ఆకతాయిలపై పెద్దాపురం పోలీసులు కేసులు నమోదు చేశారు. పట్టణంలోని రద్దీ ప్రాంతాల్లో యువకులు రాష్ డ్రైవింగ్ చేస్తూ, ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఈ సందర్భంగా పోలీసులు నిఘా ఉంచి, కొందరిని పట్టుకున్నారు. వారిలో ముగ్గురిపై ఎస్సై యు.పాపారావు కేసులు నమోదు చేశారు. మరికొందరికి జరిమానా విధించారు.

రంగా ప్రోత్సాహంతో రాజకీయాల్లో ఎదిగా

జయంతి వేడుకల్లో ద్వారంపూడి

బాలాజీచెరువు: దివంగత వంగవీటి మోహన రంగా ప్రోత్సాహంతోనే తాను రాజకీయాల్లో ప్రవేశించి రాణించగలిగానని వైఎస్సార్ సీపీ కాకినాడ సిటీ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. రంగా 79వ జయంతి సందర్భంగా స్థానిక మిలిటరీ రోడ్ లోని శారదా దేవి ఆలయం వద్ద ఉన్న రంగా కాంస్య విగ్రహానికి ఆయన శనివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం రంగా చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. అందువల్లే ఆయన మరణించి ఎన్నో ఏళ్లు గడిచినా ప్రజల హృదయాల్లో సుస్థిరంగా ఉన్నారని ద్వారంపూడి పేర్కొన్నారు. రంగా తొలిసారి కాకినాడ పర్యటనకు వచ్చిన సమయంలో ఆయన వెంట ఉన్నానని, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించడంలో రంగా పాత్ర ఎంతో ఉందన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మిలిటరీ రోడ్డు ముత్తా గోపాలకృష్ణ వారధి సమీపంలోని ప్రధాన జంక్షన్‌కు రంగా పేరు పెట్టేలా ప్రభుత్వంలోని పెద్దలు చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే ద్వారంపూడి కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, పార్టీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, మాజీ కార్పొరేటర్లు జేడీ పవన్ కుమార్, కంపర బాబి, బాల ప్రసాద్, రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, స్థానిక నాయకులు కత్తిపూడి శ్రీను, గూటాల రామకృష్ణ, కిశోర్, వాకాడ సత్తిబాబు, దమ్మాల శ్రీనివాసరావు, డోలంకి మణికంఠ, యానాల కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

రంగా జయంతి వేడుకలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

ఏపీలో ధృతరాష్ట్ర పాలన

- దుర్యోధన యువరాజు రాజ్యాంగం
- మండిపడిన జమ్ములమడక నాగమణి

జమ్ములమడక నాగమణి

కాకినాడ రూరల్: ప్రస్తుతం రాష్ట్రం ధృతరాష్ట్ర కౌగిలిలో నలిగిపోతోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్ములమడక నాగమణి విమర్శించారు. అదే సమయంలో దుర్యోధన యువరాజు రాజ్యాంగంతో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతోందని మండిపడ్డారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర పాలనపై విమర్శలు గుప్పించారు. అదే సమయంలో మచిలీపట్నం–విజయవాడ–గుంటూరు (మావిగన్) రాజధాని ప్రతిపాదనపై కూటమి ప్రభుత్వం ఎందుకు ఉలిక్కిపడుతోందని ఆమె నిలదీశారు. మావిగన్ ప్రాంతం ఇప్పటికే అభివృద్ధి చెందిన మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు నగరాలను కలుపుకోవడం వల్ల కొత్త రాజధాని నిర్మాణ భారాన్ని తగ్గించవచ్చని ఆమె పేర్కొన్నారు. రహదారులు, రైల్వే, విద్యుత్, నీటి వంటి మౌలిక వసతులు ఇప్పటికే అందుబాటులో ఉండటంతో ప్రభుత్వ వ్యయం తగ్గి, ప్రజాధనం విద్య, వైద్యం వంటి రంగాలకు మళ్లించవచ్చని తెలిపారు. విజయవాడ, గుంటూరు వంటి నగరాలు ఇప్పటికే పరిపాలనకు అనుకూలంగా ఉన్నందున రాజధాని ఏర్పాటు త్వరగా సాధ్యమవుతుందని, గన్నవరం విమానాశ్రయం విస్తరణతో అంతర్జాతీయ విమాన సర్వీసులు, కార్గో హబ్ వంటి సదుపాయాలకు అవకాశం పెరుగుతుందని చెప్పారు. అలాగే మచిలీపట్నం పోర్టు అభివృద్ధి ద్వారా ఎగుమతి–దిగుమతి, లాజిస్టిక్స్, పరిశ్రమల వృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. మూడు నగరాల మధ్య రహదారి, రైలు, మెట్రో వంటి రవాణా వ్యవస్థలు అభివృద్ధి చెందితే సమతుల్య ప్రాంతీయ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. విద్య, ఆరోగ్యం, పరిశ్రమలు, ఐటీ రంగాల్లో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. ఇప్పటికే ఉన్న మౌలిక వసతులను వినియోగించుకుని తక్కువ వ్యయంతో దశలవారీగా రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధి చేయవచ్చనే వాదన మావిగన్ ప్రతిపాదనకు అనుకూలంగా ఉందని నాగమణి పేర్కొన్నారు.

ఆలోచింపజేసిన 'చంద్రయ్యనాయుడు'

ఆకట్టుకున్న దేశభక్తుని నాటిక

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఎస్వీ రంగారావు కళాస్రవంతి ఆధ్వర్యంలో శనివారం రాత్రి స్థానిక దంటు కళాక్షేత్రంలో ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీల్లో భాగంగా నిర్వహించిన పలు నాటికలు ప్రేక్షకులను ఆలోచింప చేశాయి. ఈ పోటీలను కళాస్రవంతి అధ్యక్షులు పీజే చంటిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.వెంకన్నబాబు ప్రారంభించారు. అనంతరం ద్వార బంధాల చంద్రయ్యనాయుడు నాటిక, అనంతరం రాత, 5జి కపుల్స్, ఎడారిలో వాన చినుకులు నాటికలు ప్రదర్శించారు. శ్రీకాకుళం నుంచి నైజాం వరకూ రాజ్యాలను ఆక్రమించిన బ్రిటిష్ వారితో వీరోచితంగా పోరాడి గడగడలాడించిన వీరుడు ద్వారబంధాల చంద్రయ్యనాయుడు నాటిక ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. గుడివాడ శ్రీకృష్ణా ఆర్ట్స్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఈ నాటికలో పేద ప్రజలకు అన్నదానాలు నిర్వహించి, వారి హక్కులు కోసం బ్రిటిష్ పాలకులను ఎదురొడ్డి నిలిచిన పలు సంఘటనలు ఆధారంగా సాగిన నాటిక ఆద్యంతం ఆకట్టుకొంది. చంద్రయ్యనాయుడు పాత్రలో ఆర్‌వీఎల్ నరసింహరావు నటనకు అందరూ ముగ్ధులయ్యారు.

ద్వారబంధాల చంద్రయ్యనాయుడు నాటికలోని ఒక సన్నివేశం

క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారమే లక్ష్యం

- నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ సత్యనారాయణ
- 12వ డివిజన్ రాజీవ్ గృహకల్పలో పరిశీలన

రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో వీధికుక్కలను పట్టుకుంటున్న నగరపాలక సంస్థ సిబ్బంది

కాకినాడ లీగల్: క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం లక్ష్యంగా నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ సత్యనారాయణ శనివారం రాజీవ్ గృహకల్ప ప్రాంతాన్ని పరిశీలించారు. 12వ డివిజన్ రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో వీధులు, తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, వీధిలైట్లను పరిశీలించి ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, వీధి లైట్లు లేక, వీధి కుక్కుల సంచారంతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆయనకు వివరించారు. కొన్ని సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. నగర అభివృద్ధి, పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. స్వచ్ఛత కార్యక్రమాలకు ప్రజలు సహకరిస్తే నగరాన్ని మరింత పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో కార్పొరేషన్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ రామ్మోహన్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రత్నబాల, డిప్యూటీ ఇంజినీర్ ప్రవీణ్ చంద్ర, వాటర్ వర్క్స్ డీఈ లక్ష్మీనారాయణతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అల్లూరిని ఆదర్శంగా తీసుకోవాలి



అల్లూరి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తదితరులు

కరప ఎంపీడీఓ కార్యాలయంలో అల్లూరికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ శ్రీలక్ష్మి

- కలెక్టర్ హరేంధిర ప్రసాద్
- డీఎస్ఏ ఆధ్వర్యంలో ఘనంగా నివాళి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ధైర్య సాహసాలు, నాయకత్వ పటిమ, త్యాగ నిరతి నేటి తరానికి ఆదర్శం కావాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అన్నారు. అల్లూరి జయంతిని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు ఎంపీ సానాసతీష్ బాబు, కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొంబాబు తదితరులు హాజరై మన్నెం వీరుడికి నివాళులు అర్పించారు.

అల్లూరికి ఘన నివాళి

కరప: మండలంలోని పలుగ్రామాల్లో శనివారం అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి కార్యాలయం సిబ్బందితో కలసి అల్లూరికి నివాళులు అర్పించారు. ఏపీఓ ఆర్. ప్రభాకర్, ఐ.కార్తీక్, టి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు అల్లూరికి నివాళులర్పించారు.

ఏపీఎస్పీలో అల్లూరికి నివాళి

కాకినాడ రూరల్: స్థానిక మూడో బెటాలియన్ ఏపీఎస్పీ క్యాంప్‌లో మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా బెటాలియన్ కమాండెంట్ కె.నవీన్ కుమార్ హాజరై అల్లూరి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం అల్లూరి చేసిన పోరాటం, త్యాగం చిరస్మరణీయమని, ఆయన ఆశయాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో అసిస్టెంట్ కమాండెంట్ డి.మురళి కుమార్, అధికారులైన బీఎస్సీ శేఖర్ రావు, మోహన్ రావు, మన్మధరావులతో పాటు ఆర్ఐలు అజయ్‌కుమార్, మురళీమోహన్‌రావు, హరిబాబు, శ్రీనివాసరావు, డి.రాజు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని అల్లూరికి స్మృత్యంజలి ఘటించారు.

అల్లూరికి నివాళులర్పిస్తున్న కమాండెంట్ కె.నవీన్ కుమార్, అధికారులు, సిబ్బంది

ఆధునిక ఫుడ్ హబ్‌పై అధికారుల అధ్యయనం

అహ్మదాబాద్‌లో రెండు రోజు శిక్షణ

కాకినాడ లీగల్: పీఎం స్వనిధి పథకం కింద నగరంలో ఆధునిక ఫుడ్ హబ్ ఏర్పాటు చేసే ప్రక్రియను నగరపాలక సంస్థ కీలకంగా తీసుకోంది. ఫుడ్ హబ్ నిర్మాణానికి ప్రణాళికలు, రూపకల్పన, నిర్వహణ విధానాలపై సమగ్ర అవగాహన కల్పించేందుకు అహ్మదాబాద్‌లో శుక్ర, శనివారాల్లో నిర్వహించిన రెండు రోజుల డిజైన్ వర్క్‌షాప్‌లో కార్పొరేషన్ ప్రతినిధులు పాల్గొని విలువైన సూచనలు, సాంకేతిక అంశాలను అధ్యయనం చేశారు. పీఎం స్వనిధి పథకం కింద ఫుడ్ హబ్ ఏర్పాటుకు సంబంధించి ఇప్పటికే పోర్టల్‌లో ప్రతిపాదనలు నమోదు చేసింది. ఈ ప్రతిపాదనల అమలులో భాగంగా నిర్వహించిన డిజైన్ వర్క్‌షాప్‌లో కార్పొరేషన్ తరపున టీపీఆర్వో కె.శైలజ, స్మార్ట్ సిటీ ఇంజినీర్ శ్రీమణికంఠ, ఆర్కిటెక్ట్ పాల్గొన్నారు.

ఆధునిక ఫుడ్ హబ్ ఏర్పాటుపై అహ్మదాబాద్‌లో శిక్షణ పొందుతున్న నగరపాలక సంస్థ అధికారులు

వర్క్‌షాప్‌లో ఫుడ్ హబ్ నిర్మాణ నమూనాలు, ఆధునిక డిజైన్ విధానాలు, అవసరమైన మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత ప్రమాణాలు, వ్యర్థాల నిర్వహణ, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య సదుపాయాలు, వినియోగదారులకు అనుకూల వాతావరణం కల్పించే అంశాలపై